# ఎన్నికల నియమావళి పాటించాలి

- నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్ టౌన్, అక్టోబర్ 10 : ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అందరూ ఎన్నికల నియమావళి పాటించాలని, లేకపోతే చట్టప్రకారం చర్యలుంటాయని నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాలకు నవంబర్ 30న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ అధికారికంగా షెడ్యూల్ ప్రకటించిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు అనుమతి లేకుండా ర్యాలీలు, ఇతర సమావేశాలు నిర్వహించవద్దని సూచించారు. జిల్లాలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రూ.50 వేలకు మించి తీసుకెళ్తే అందుకు సంబంధించిన వివరాలను చూపించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 906 పోలింగ్ కేంద్రాలుంటాయని, పోలింగ్ కేంద్రాల పరిధిలో 18 ఏండ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించనున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా గోడలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని, ప్రభుత్వ స్థలాల వద్ద ప్రచారం చేయవద్దని సూచించారు. జిల్లాలో మొత్తం 7,11,130 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఇందులో స్త్రీలు 3,66,683, పురుషులు 3,44,448, ట్రాన్స్‌జెండర్లు 49, సర్వీసు ఓటర్లున్నారని వెల్లడించారు. ప్రజాస్వామ్యబద్ధంగా స్వేచ్ఛగా ఓటు వేసుకునేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కచ్చితంగా నామినేషన్ మొదలుకొని ఓట్ల లెక్కింపు వరకు ఖర్చుల వివరాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్‌కు రిటర్నింగ్ అధికారులుగా ఆర్డీవోలను నియమించినట్లు చెప్పారు.

**మీడియా సెల్ ప్రారంభం..**

ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు వివరించాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీడియా సెల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజు ఎన్నికలకు సంబంధించిన అప్‌డేట్ ఈ మీడియా సెల్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. నిరంతరం జిల్లాలో ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ అధికారులు, పార్టీల సమావేశాలపై దృష్టి పెడుతామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఏఎస్పీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జాన్సన్ నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

# కేసీఆర్‌తోనే సంక్షేమ పాలన

- బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి
- ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్
- పెంబిలో కార్యకర్తలతో సమావేశం

పెంబి, అక్టోబర్ 10 : ముఖ్యమంత్రి కేసీఆర్‌తో రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతున్నదని బీఆర్‌ఎస్ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు. పెంబి మండల కేంద్రంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భావితరాలకు మార్గనిర్దేశం చేయడంలో బీఆర్‌ఎస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు నచ్చి ఇతర పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో గులాబీ గూటిలో చేరుతున్నారన్నారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల సర్పంచులు, కార్యకర్తలు జాన్సన్ నాయక్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సల్ల నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్‌లు పూర్ణచందర్ గౌడ్, సుధాకర్, తానాజీ, మహేందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వైద్యవిద్యార్థులకు వైట్ కోట్ సెర్మనీ

ఎదులాపురం,అక్టోబర్10 : రిమ్స్‌లో (2023 ఎంబీబీఎస్ బ్యాంచ్) విద్యార్థులకు వైట్ కోట్ సెర్మనీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ప్రిన్సిపాల్ సంజయ్ వంజరి, వైస్ ప్రిన్సిపాలు సరోజ, విద్యావిల్సన్ తదితరులున్నారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

- బీఆర్‌ఎస్ పార్టీ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్
- కజ్జర్ల, దేవాపూర్ గ్రామాల్లో పర్యటన

తలమడుగు, అక్టోబర్ 10 : అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. తలమడుగు మండలం కజ్జర్ల, దేవాపూర్ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ముందుగా గ్రామస్తులు ఆయన ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డీడీసీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కజ్జర్లలో పర్యటిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్

# ఎన్నికల ప్రచారం షురూ..

- నిర్మల్‌లో మంత్రికి మద్దతుగా కౌన్సిలర్ ప్రచారం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 10 : ఎన్నికల ప్రచారం షురూ అయ్యింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టి, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని హ్యాట్రిక్ మంత్రిగా గెలిపించాలని కోరుతూ గుల్జార్ మార్కెట్ కౌన్సిలర్ తౌహిదుద్దీన్ ప్రచారం చేస్తున్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, అల్లోల ఫొటోలతో ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల పోస్టర్లను అతికిస్తూ ప్రచారం ప్రారంభించారు. అభివృద్ధి చేస్తున్న పార్టీలకే పట్టం కట్టాలని, మోసపూరిత హామీలు ఇస్తూ ఇబ్బందులకు గురిచేసే పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కాగా, కౌన్సిలర్‌ను పార్టీ వర్గాలు అభినందిస్తున్నాయి.



పోస్టర్లను గోడలకు అతికింపజేస్తున్న కౌన్సిలర్ తౌహిదుద్దీన్

# వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- సిలబస్ త్వరగా పూర్తి చేయాలి
- విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి
- నిర్మల్ డీఐఈవో పర్శురాం
- కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిశీలన



కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశమైన డీఐఈవో పర్శురాం

కుభీర్, అక్టోబర్ 10 : ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియట్ విద్యాధికారి పర్శురాం సూచించారు. కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఐఈవో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేసి, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని అధ్యాపకులను సూచించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

# ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

బాసర, అక్టోబర్ 10 : బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి సన్నిధిలో ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించే నవరాత్రోత్సవాల బందోబస్తు ఏర్పాట్లను సీఐ వినోద్‌రెడ్డి పరిశీలించారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా, అభద్రతా భావం ఏర్పడకుండా ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్ఐ గణేశ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామారావు, పోలీసు సిబ్బంది, దేవాలయ సిబ్బంది ఉన్నారు.



ఆలయంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ వినోద్‌రెడ్డి

# మొబైల్ ఫోన్ పోతే ఆందోళన వద్దు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 10 : మొబైల్ ఫోన్ పోయిన, దొంగిలించబడిన ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని నిర్మల్ ఎస్పీ సీహెచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న, దొంగలించబడిన సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ట్రేస్ చేసి మంగళవారం బాధితులకు అందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో 11 మంది బాధితులకు ఎస్పీ వాటిని అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ టెక్నాలజీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్ ఇన్‌చార్జి రవి కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.